1857 తిరుగుబాటు - కారణాలు.. ఫలితాలు

ప్ర: 1857 తిరుగుబాటు ఫలితాలను విశ్లేషించండి?

జ: వాస్తవానికి 1857 తిరుగుబాటు బ్రిటిషర్ల పునాదులను కదిలించింది. ఫలితంగా ఆ తిరుగుబాటుకు కారణాలను విశ్లేషించుకున్న బ్రిటిష్ ప్రభుత్వం కొత్త మార్పులకు శ్రీకారం చుట్టింది. అవి..

- భారతదేశ అధికారం ఈస్టిండియా కంపెనీ నుంచి బ్రిటిష్ రాజమకుటానికి బదిలీ అయింది. భారత వ్యవహారాలను పర్యవేక్షించేందుకు బ్రిటిష్ రాజ్య కార్యదర్శి పదవిని సృష్టించారు. గవర్నర్ జనరల్‌ను వైస్రాయ్‌గా వ్యవహరించడం ప్రారంభమైంది.
- భారతీయుల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోబోమని, ప్రభుత్వోద్యోగాల్లో జాతి వివక్ష లేకుండా భారతీయులకు సమాన అవకాశాలు కల్పిస్తామని, భారతదేశాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామనే హామీలు గుప్పిస్తూ 1858లో విక్టోరియా రాణి పేరుతో ప్రకటన వెలువడింది.
- తిరుగుబాటు తలెత్తడానికి పాలకులు, పాలితుల మధ్య భావ ప్రసార లోపమే ప్రధాన కారణమని బ్రిటిషర్లు భావించారు. ప్రజాభిప్రాయాన్ని తెలుసుకునేందుకు భారతీయులకు అవకాశం కల్పిస్తూ కొన్ని చట్టాలను ప్రవేశపెట్టడం ప్రారంభించారు. 1861 నుంచి కాలానుగుణంగా కొన్ని చట్టాలు చేస్తూ శాసన సంబంధ వ్యవహారాల్లో భారతీయులకు స్థానం కల్పించే ప్రయత్నం చేశారు.
- సైన్యాన్ని పూర్తిగా పునర్‌వ్యవస్థీకరించారు. సైన్యంలో యూరోపియన్ల సంఖ్యను పెంచారు. కీలకమైన ఫిరంగి దళాలను పూర్తిగా యూరోపియన్‌ల నేతృత్వంలోనే నిర్వహించారు. సైన్యంలో జాతీయ భావం కలగకుండా ఉండేందుకు కుల, మత, వర్గ, ప్రాంతాల ప్రాతిపదికగా దళాలను ఏర్పరిచారు. సైనికులపై బాహ్య ప్రభావం లేకుండా ఉండేందుకు వార్తా పత్రికలను కూడా వారికి అందుబాటులో ఉంచలేదు.
- తిరుగుబాటు కాలంలో ఉన్న హిందు, ముస్లిం సమైక్యతను దెబ్బతీయడం తమ మనుగడకు ఎంతో అవసరమని బ్రిటిషర్లు భావించారు. ఫలితంగా విభజించి పాలించే విధానాలు మొదలయ్యాయి. తొలుత ముస్లింల పట్ల వివక్షను ప్రదర్శించి, కాంగ్రెస్ ఉద్యమం మొదలయ్యాక ముస్లింల పట్ల పక్షపాత వైఖరిని ప్రదర్శిస్తూ వారిని జాతీయోద్యమానికి దూరం చేయాలని ప్రయత్నించారు.
- స్వదేశీ పాలకుల్లో అనుమానాలు పోగొట్టి, భారతదేశంలో వారిని బలమైన మద్దతుదారులుగా రూపొందించుకున్నారు. ఇకపై ఆక్రమణలు ఉండవని, స్వదేశీ సంస్థానాల మనుగడకు ప్రమాదం లేదని ప్రకటించారు.
- తిరుగుబాటు వల్ల భారతీయులకు, బ్రిటిషర్లకు మధ్య జాతి విద్వేషాలు పెరిగాయి. తిరుగుబాటు సందర్భంగా ఇరు వర్గాలు చేసిన అకృత్యాలు ఇందుకు ముఖ్య కారణాలు. 'ద పంచ్' అనే బ్రిటిష్ పత్రిక తిరుగుబాటు అనంతరం భారతీయులను 'సగం జంతువులుగా, సగం నీగ్రోలుగా' వర్ణించింది.



- 1857 తిరుగుబాటు విఫలమైనప్పటికీ దాని ప్రభావం భవిష్యత్తుపై ప్రసరిస్తూనే ఉంది. బ్రిటిషర్లకు వ్యతిరేకంగా పోరాడే ప్రబల సంప్రదాయాన్ని ఈ తిరుగుబాటు సృష్టించింది. తిరుగుబాటులో పాల్గొన్న లక్ష్మీబాయి, తాంతియాతోపే వంటి వారు జాతీయ వీరులుగా పేరు గడించారు. వి.డి. సావర్కర్ 1909లో ఈ తిరుగుబాటును భారత ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంగా కీర్తిస్తూ రాసిన పుస్తకం విశేష ప్రభావాన్ని కలిగించింది. విప్లవ తీవ్రవాదులెందరో ఈ తిరుగుబాటు నుంచే స్ఫూర్తి పొందారు. మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో జరిగిన గదర్ తిరుగుబాటు కూడా 1857 తిరుగుబాటు స్ఫూర్తితో సాగిందే. మరోవైపు బ్రిటిషర్లకు 1857 తిరుగుబాటు ఎప్పటికీ మర్చిపోలేని అనుభవాన్నిచ్చింది. వారి విధానాలు, ఆలోచనలో 1857 తిరుగుబాటు ఒక నీడలాగా తన ప్రభావాన్ని ప్రసరించింది.

ప్ర: 1857 తిరుగుబాటుకు ప్రధాన కారణాలు తెలపండి?

జ: సిపాయిల తిరుగుబాటుగా పేరు గడించిన 1857 తిరుగుబాటు కేవలం సిపాయిలనే కాకుండా భారతీయ సమాజంలోని ఇతర వర్గాలను కూడా ప్రభావితం చేసింది. ఈ తిరుగుబాటుకు సాంఘిక, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ పరమైన లోతైన కారణాలున్నాయి. అవి..

ఆర్థిక కారణాలు:

బ్రిటిష్ పరిపాలన, ఆర్థిక విధానాల కారణంగా రైతులు, చేతి వృత్తులపై ఆధారపడిన ప్రజలు ఆర్థికంగా క్షీణించారు. బ్రిటిషర్లు భారీ మొత్తంలో భూమి శిస్తును వసూలు చేయడానికి ఎంతో ప్రాధాన్యమిచ్చారు. శాశ్వత శిస్తుపద్ధతి అమల్లో ఉన్న ప్రాంతాల్లో రైతు కౌలుదారునిగా మారిపోవాల్సి వచ్చింది. తద్వారా జమీందారీ దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సి వచ్చింది. రైత్వారీ ప్రాంతాల్లో అధిక భూమి శిస్తును చెల్లించేందుకు రైతులు వడ్డీ వ్యాపారుల కబంధ హస్తాల్లో చిక్కుకుని చివరకు భూములను కోల్పోయారు. ఈ కారణాలు 1857 తిరుగుబాటులో రైతులు చురుగ్గా పాల్గొనేట్లు చేశాయి. మరోవైపు బ్రిటిషర్ల వాణిజ్య విధానాల వల్ల చేతి వృత్తులపై ఆధారపడిన ప్రజలు

తమ జీవనోపాధిని కోల్పోయి వ్యవసాయ కూలీలుగా మారారు. ఫలితంగా ఆ తిరుగుబాటులో చేతి వృత్తుల వారు కూడా పాల్గొన్నారు.

రాజకీయ కారణాలు:

బ్రిటిషర్ల రాజకీయ విధానాలు కూడా తీవ్ర అసంతృప్తిని కలిగించాయి. ఎలాంటి నీతి నియమాలు లేకుండా బ్రిటిషర్లు తమ అధికారాన్ని విస్తరించుకున్న పద్ధతి వారి పట్ల భారతీయ ప్రజల్లో అసంతృప్తిని పెంచింది. వెల్లస్లీ సైన్య సహకార పద్ధతి ద్వారా స్వదేశీ పాలకులపై ఎన్నో నియంత్రణలు విధించాడు. డల్హౌసీ మరింత ముందుకు వెళ్లి రాజ్య సంక్రమణ సిద్ధాంతం ద్వారా ఎన్నో స్వదేశీ రాజ్యాలను బ్రిటిష్ ఇండియా సామ్రాజ్యంలో విలీనం చేశాడు (నాగ్‌పూర్, జైత్‌పూర్, సంబల్‌పూర్, ఝాన్సీ తదితర). అంతేకాకుండా 1856లో దుష్పరిపాలన నెపంతో అవధ్‌ను ఆక్రమించాడు. అందుకే 1857 తిరుగుబాటులో అవధ్‌కు చెందిన సిపాయిలు కీలక పాత్ర పోషించారు. బ్రిటిషర్లు రెండో బాజీరావు వారసుడైన నానాసాహెబ్‌కు పింఛన్ నిరాకరించారు. మొఘల్ చక్రవర్తి వారసులు తమ హోదాను, రాజభవనాలను విడిచి వెళ్లాలని కానింగ్ చేసిన ప్రకటన ముస్లింలలో తీవ్ర అసంతృప్తిని రగిల్చింది.

సామాజిక, మత కారణాలు:

బ్రిటిషర్లు జాత్యహంకార ధోరణి, తమ అనుకూల మతాన్ని ప్రోత్సహించడం హిందువులను, ముస్లింలను రెచ్చగొట్టింది. బ్రిటిషర్ల అనుకూల వర్గానికి చెందిన మిషనరీలు హిందూ మతాన్ని, ఇస్లాం మతాన్ని తీవ్రంగా విమర్శించడం, మతాంతరీకరణలను ప్రోత్సహించడం హిందువులు, ముస్లింలలో భయాన్ని కలిగించింది. బ్రిటిషర్లు 1850లో చేసిన ఒక చట్టం (రెలిజియస్ డిజబిలిటీ యాక్ట్) ద్వారా మతం మార్చుకున్న వారికి వారసత్వపు హక్కుల్ని సంక్రమింపచేయడం ఈ భయాన్ని అధికం చేసింది. బ్రిటిషర్లు చేసిన సతీసహగమన నిషేధ చట్టం (1829), వితంతు పునర్వివాహ చట్టం (1850) వంటి ప్రగతిశీల చర్యలను కూడా హిందువులు అనుమానించారు. ఇంగ్లిష్ విద్య, మహిళా విద్యను సంప్రదాయ వాదులు వ్యతిరేకించారు. బ్రిటిషర్లు హిందువులను, ముస్లింలను నీచంగా సంబోధించడం, భారతీయుల పట్ల వారు చేసిన నేరాలకు సరైన శిక్షలు లేకపోవడం భారతీయులను రెచ్చగొట్టాయి.

సిపాయిల కారణాలు:

తిరుగుబాటును ప్రారంభించిన సిపాయిల్లో తీవ్ర అసంతృప్తి ఉంది. భారతీయ సిపాయి ఎంత సామర్థ్యాన్ని ప్రదర్శించినా సుబేదార్ హోదాను మించి ఎదిగే అవకాశం ఉండేది కాదు. అప్పుడే వచ్చిన బ్రిటిష్ సైనికులు త్వరితంగా పదోన్నతులు పొందగలిగేవారు. భారత దేశంలో బ్రిటిష్ సామ్రాజ్యం విస్తరించే క్రమంలో సిపాయిల్లో అసంతృప్తి మరింత పెరిగింది. సొంత ఊరికి దూరంగా పోరాడాల్సి రావడం, అలాంటి సందర్భాల్లో ప్రత్యేక భత్యాలు లేకపోవడం దీనికి ప్రధాన కారణాలు. 1850లో వచ్చిన జనరల్ సర్వీస్ ఎన్‌లిస్ట్‌మెంట్ యాక్ట్ ద్వారా సిపాయిలు అవసరమైతే సముద్రాంతర ప్రయాణం కూడా చేయాల్సి వచ్చేది. ఇది బెంగాల్ సైన్యంలోని అధిక సంఖ్యాకులైన బ్రాహ్మణ, రాజపుత్ర సిపాయిలను రెచ్చగొట్టింది. 1857 తిరుగుబాటులో వీరే కీలక పాత్ర పోషించారు.

తక్షణ కారణం:

కొత్తగా సైన్యంలో ప్రవేశపెట్టిన ఎన్‌ఫీల్డ్ రైఫిల్‌కు సంబంధించిన కొవ్వు పూసిన తూటాలు వివాదాస్పదమయ్యాయి. ఆవు, పంది కొవ్వులతో ఆ తూటాలు తయారు చేశారని చెలరేగిన పుకార్లు సిపాయిల్లో ఆందోళన, ఆగ్రహం కలిగించాయి. ఆ తూటాల వాడకాన్ని నిరసిస్తూనే 1857 తిరుగుబాటు మొదలైంది.

ప్ర: 1857 తిరుగుబాటు వైఫల్యానికి కారణాలను విశ్లేషించండి?

జ: సిపాయిల తిరుగుబాటు (1857) బ్రిటిష్ సామ్రాజ్య పునాదులను కదిలించినప్పటికీ... కొద్ది నెలల కాలంలోనే బ్రిటిషర్లు ఆ తిరుగుబాటును అణచివేసి నియంత్రణ సాధించగలిగారు. తిరుగుబాటు వైఫల్యానికి కారణాలను పలు రకాలుగా విశ్లేషించవచ్చు. వాటిలో ముఖ్యమైనవి..

- ఈ తిరుగుబాటు కొన్ని ప్రాంతాలకే పరిమితమైంది. ప్రధానంగా ఉత్తర భారతదేశం, మధ్య భారతదేశంలోని కొన్ని ప్రాంతాల్లోనే దాని ప్రభావం కనిపించింది. తూర్పు, దక్షిణ భారతదేశాలపై దాని ప్రభావం స్వల్పం. తిరుగుబాటులో ప్రధానంగా బెంగాల్ సైన్యం పాల్గొంది. బొంబాయి, మద్రాసు సైన్యాలు తిరుగుబాటుకు దూరంగా ఉన్నాయి.
- తిరుగుబాటు భారతీయ సమాజంలోని కొన్ని వర్గాలను ప్రభావితం చేయలేకపోయింది. బ్రిటిషర్ల ద్వారా లాభం పొందిన జమీందారీ వర్గం వారిని పూర్తిగా సమర్థించింది. తొలిదశలో తిరుగుబాటులో కీలక పాత్ర పోషించిన అవధ్ తాలూక్దార్లు ప్రభుత్వం తమ ఎస్టేట్‌లను పునరుద్ధరించగానే ప్రభుత్వానికే మద్దతిస్తూ తిరుగుబాటుకు ద్రోహం చేశారు. వడ్డీ వ్యాపారులు, వర్తకులు, బొంబాయి, మద్రాసు, కలకత్తా నగరాల్లోని వాణిజ్య వర్గాలు బ్రిటిషర్లనే సమర్థించాయి. తిరుగుబాటు తిరోగమన శక్తులకు సంబంధించిందని... భారతీయ ప్రగతికి బ్రిటిష్ పరిపాలన కీలకమని భావించిన ఆధునిక విద్యాధికులు తిరుగుబాటు కాలంలో బ్రిటిషర్లనే సమర్థించారు.
- తిరుగుబాటుదారుల్లో భారతీయ జాతీయభావం కనిపించలేదు. మరాఠీలు, సిక్కులు, పంజాబీలు, బెంగాలీలు, మద్రాసీలు, ప్రాంతీయ పరిధులను అధిగమించలేకపోయారు. అందరూ సమైక్యంగా బ్రిటిషర్లను ఎదిరించాలనే స్పృహ లేకుండా వ్యవహరించారు.
- తిరుగుబాటుకు నాయకత్వం వహించిన ఫ్యూడల్ శక్తులు కూడా స్వార్థ కారణాలతో పని చేశారు. నానాసాహెబ్ తనకు పింఛన్ ప్రకటిస్తే తిరుగుబాటుకు దూరమవుతానని ప్రకటించాడు. లక్ష్మీబాయి తన ఝాన్సీ కోసం మాత్రమే పోరాడింది. అవధ్ బేగం కూడా

స్వార్థంతోనే నాయకత్వం వహించింది. బహదూర్ షా ఎలాంటి ఆసక్తి లేకుండా తప్పనిసరి పరిస్థితుల్లో నాయకత్వం వహించాడు. ఇలాంటి నాయకులు పోరాటానికి స్ఫూర్తినివ్వలేకపోయారు.

- నాయకుల మధ్య సమన్వయ లోపం కూడా వైఫల్యానికి ముఖ్య కారణం. నానాసాహెబ్ బహదూర్‌షాతో అరమరికలు లేని సంబంధం పెట్టుకోలేకపోయాడు. బేగం హజరత్ మహల్ తన సహాయకులతో పేచీ పెట్టుకుంది. వివిధ ప్రాంతాల్లో నాయకులంతా పరస్పర విశ్వాసంతో వ్యవహరించకపోవడం తిరుగుబాటును బలహీనం చేసింది.
- బ్రిటిషర్ల సైనిక బలం, ఆయుధ సంపత్తి ముందు భారతీయ సిపాయిలు ఎక్కువ కాలం ఎదురొడ్డలేకపోయారు. తమ వద్దనున్న ఆయుధ సామగ్రి అయిపోయాక సిపాయిలు కత్తులు, బళ్లాలు వంటి ఆయుధాలను చేపట్టారు. అదే సమయంలో క్రిమియా యుద్ధం ముగియడంతో బ్రిటిషర్లు భారీ సంఖ్యలో తమ సైన్యాన్ని భారతదేశానికి తరలించడం కూడా తిరుగుబాటు వైఫల్యానికి కారణం.
- కొత్తగా ప్రవేశపెట్టిన రైల్వే, టెలిగ్రాఫ్ వ్యవస్థ కూడా బ్రిటిషర్ల విజయానికి కారణమైంది. హడ్సన్, హవ్‌లాక్, హ్యారోజ్, నీల్ వంటి సమర్థులైన సేనానుల కృషి కూడా బ్రిటిషర్లకు లాభించింది.